క్లుప్తంగా

'ఎర్ర కాలువ' నుంచి 10,700 క్యూసెక్కుల విడుదల



అనంతపల్లి వంతెన వద్ద ఎర్ర కాలువ వరద ఉధృతి

నల్లజర్ల: జంగారెడ్డిగూడెం సమీపంలోని ఎర్ర కాలువ జలాశయం వరద నీటితో పొంగి పొర్లుతోంది. దాంతో అధికారులు బుధవారం ఉదయం 1,700, సాయంత్రం 9,000 వేల క్యూసెక్కుల మిగులు జలాలను దిగువకు విడుదల చేసినట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దాంతో అనంతపల్లి హైడ్రాలజీ ప్రాజెక్ట్ వద్ద నీటిమట్టలం క్రమేపీ పెరుగుతోంది. ఇక్కడ బుధవారం ఉదయం 1.7 మీటర్లు ఉన్న నీటి మట్టం క్రమేపీ రెండు మీటర్లకు పెరిగింది. బుధవారం రాత్రికి హైడ్రాలజీ ప్రాజెక్ట్ వద్ద నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇక్కడి నుంచి దిగువకు ప్రవహించే వరద నీరు నందమూరు అక్విడెక్ట్ వద్దకు చేరుతుంది. బుధవారం సాయంత్రానికి అక్విడెక్ట్ వద్ద నీటిమట్టం 31.3 అడుగులకు చేరింది.అనంతపల్లి వద్ద నీటిమట్టం మూడున్నర మీటర్లకు వస్తే తప్ప ఎటువంటి ప్రమాదం ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఎగువున కురిసిన భారీ వర్షాలతో ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సూచించారు. మండలంలోని తాళ్లపాలెం వద్ద నందమూరు అక్విడెక్టు వద్ద ఎర్ర కాలువ ప్రవాహ ఉధృతిని బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. కోరుమామిడి, తాడిమళ్ల, కంసాలిపాలెం వద్ద ఎర్ర కాలువ గట్లకు లీకేజీలు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జలవనరులశాఖ డీఈ వి.సత్యదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు 61 కుటుంబాలు



తాళ్లపూడిలో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కొవ్వూరు ఆర్డీవో, తహసీల్దార్

తాళ్లపూడి: భారీ వర్షం వల్ల ముంపులో చిక్కుకున్న తాళ్లపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురం గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని 61 కుటుంబాల వారి కోసం అధికారులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొవ్వూరు ఆర్డీవో కృష్ణ నాయక్, తహసీల్దార్ టి.రాధిక, ఏఎస్‌వో వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది బుధవారం పునరావాస కేంద్రాలను పరిశీలించారు. వర్షపు నీరు తగ్గే వరకూ వారికి పునరావాసాన్ని కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ప్రక్కిలంక ఏటిగట్టు ప్రాంత నివాసితులకు, తాళ్లపూడిలోని యనాది కాలనీ వాసులకు, వేగేశ్వరపురం లోని యానాది కాలనీ వాసులకు ఆయా గ్రామాల్లోని కమ్యూనిటీ హాళ్లలో పునరావాసం ఏర్పాటు చేశారు. వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి ప రశురామారావు సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్తు శాఖకు రూ.20 లక్షల మేర నష్టం

యుద్ధప్రాతిపదికన సరఫరా పునరుద్ధరణ



కొవ్వూరు మండలం పశివేదలలో విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులు

కొవ్వూరు: తుపాను ప్రభావంతో వీచిన బలమైన గాలుల వల్ల నియోజకవర్గంలో విద్యుత్తు శాఖకు సుమారు రూ.20 లక్షలమేర నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. బంగారమ్మపేట, వాడపల్లి, మార్కొండపాడు, ఐ.పంగిడి, పెద్దేవం, ఎస్.ముప్పవరం, పశివేదల, దొమ్మేరు, ప్రక్కిలంక తదితర గ్రామాల్లో నష్ట తీవ్రత అధికంగా ఉంది. ఎక్కడికక్కడ చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ లైన్‌లు తెగిపడ్డాయి. దాంతోపాటు 62 విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. ఐదు త్రీ ఫేజ్, 13 సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. యుద్ధ ప్రతిపాదికన ఆశాఖ అధికారులు పునరుద్ధరణ పనుల చేపట్టి సరఫరా ను పునరుద్ధరించారు. లైన్ పునరుద్ధరణలో భాగంగా విద్యుత్ సరఫరాకి సైతం తీవ్ర ఆటంకం ఏర్పడింది. కొవ్వూరు మండలంలోనే అధిక నష్టం వాటిల్లింది. 11 కేవీ విద్యుత్ స్తంభాలు 14, ఎల్‌టీ లైన్ స్తంభాలు ఎనిమిది కూలిపోయాయి.



దేవరపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో నీటిలో ఉన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



త్యాజంపూడిలో వరి పైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి



గోపాలపురం పెద్దగూడెంలో వర్షానికి కూలిపోయిన పెంకుటిల్లు



అజ్జరంలో నీట మునిగిన ధాన్యపు రాశి వద్ద దిగాలుగా రైతులు

అన్నదాతపై మిచాంగ్ పంజా



అన్నవరప్పాడులో నీట మునిగిన వరి దుబ్బులను చూపిస్తున్న రైతు పప్పుల శ్రీనివాస్

- మూడు రోజుల్లో 698 మిల్లీ మీటర్ల వర్షపాతం
- నీటమునిగిన వరిచేలు
- పొగాకు తోటల్లో ఇసుక మేటలు
- రైతులకు అపార నష్టం

దేవరపల్లి: ఆఖరి దశలో మిచాంగ్ తుపాన్ అన్నదాతపై పంజా విసిరింది. తుపాను ప్రభావంతో మూడు రోజులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం రాత్రి బలమైన ఈదురు గాలులు వీయడంతో పాటు దాదాపు 12 గంటల పాటు వర్షం దిమ్మరించింది. ఈ వర్షాన్ని చూసి జనం భయభ్రాంతులయ్యారు. పంటలను వరద ముంచెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి, పొగాకు, మినుము, మొక్కజొన్న, అరటి, పొగాకు నారుమడులు నీట మునిగాయి. కోతకు వచ్చిన వరి చేలు నిండా తడిసిపోయి నేలనంటాయి. కళ్లాల్లో బరకాలు కప్పి ఉంచిన ధాన్యం రాశులు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. పొగాకు తోటలను వరదనీరు ముంచెత్తడంతో తోటల్లో ఇసుక మేటలు వేశాయి. మొలక దశలో ఉన్న మొక్కజొన్న తోటలు దెబ్బతిన్నాయి. వర్షాలకు మొక్క మొవ్వు కుళ్లిపోయి చనిపోతుందని రైతులు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గత మూడు రోజుల్లో 698 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా ద్వారకాతిరుమలలో గరిష్టంగా 250, దేవరపల్లిలో 128, నల్లజర్లలో 193.8, గోపాలపురంలో 121.14 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గత నాలుగేళ్లలో ఇంత భారీ వర్షం కురవడం ఇదేనని రైతులు అంటున్నారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే తలారి పర్యటన

నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లోని మంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బుధవారం ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ పర్యటించారు. ముంపు బారిన పడిన పంటలను ఆయన పరిశీలించారు. దేవరపల్లి ఎస్సీ, బీసీ ప్రాంతాలకు వెళ్లి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించి ముంపు నుంచి ప్రజలను కాపాడాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ సమీపంలో నీట మునిగిన పొలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. నీటిలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని ధైర్యం చెప్పారు. సుమారు 40 బస్తాల ధాన్యం నీట మునిగినట్టు రైతు తెలిపారు. అర్ధరాత్రి కురిసిన వర్షానికి దేవరపల్లి జంక్షన్‌లో ప్రధాన రహదారిపై మూడు అడుగుల ఎత్తున నీరు ప్రవహించడంతో స్టేట్ బ్యాంకులోకి, దుకాణాల్లోకి నీరు చేరింది. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన దేవరపల్లి ఎంపీపీ దుర్గారావు రోడ్డుపై గల డివైడర్‌ను తొలగించాలని అధికారులకు సూచించారు. ఆగమేఘాలపై తొలగించి సమస్యను పరిష్కరించారు. త్యాజంపూడిలో నీట మునిగిన వరి చేలను, నీటిలో ఉన్న ధాన్యం రాశులను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించారు. వరి చేలు మొలకలు వస్తున్నాయని, కళ్లాల్లోని ధాన్యపు రాశులు నీటిలో మునిగి ఉన్నట్టు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ మచాంగ్ తుపాన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయినట్టు తెలిపారు. పంట నష్టం నమోదు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, త్యాజంపూడి ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు

భారీ వర్షాలకు కూలిన ఇళ్లు

గోపాలపురం: భారీ వర్షాలకు మండలంలోని పెద్దగూడెం, దొండపూడి, వేళ్లచింతలగూడెం గ్రామాల్లోని పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. గోపాలపురం పంచాయతీ పరిధిలోని పెద్దగూడెంలో మరపట్ల పాపమ్మకు చెందిన పెంకుటిల్లు సగభాగం కూలిపోయింది. అదే గ్రామంలోని యాళ్ల పెద వెంకమ్మకు చెందిన తాటాకిల్లు కూడా కూలిపోయింది. గోపాలపురం వీఆర్వో కె.లక్ష్మి పంచనామా నిర్వహించారు. బాధితులకు తక్షణ సహాయం అందించినట్టు ఆమె చెప్పారు. అలాగే వేళ్లచింతలగూడెం, దొండపూడి గ్రామాల్లో పాక్షికంగా దెబ్బతిన్న రెండు ఇళ్లను గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. తుపాను తాకిడికి దెబ్బతిన్న పంటలు, గృహాలపై పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నట్టు తహసీల్దార్ బి. రవీంద్రనాథ్ తెలిపారు. గోపాలపురం మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో దెబ్బతిన్న వరి, మినుము, మొక్కజొన్న పంట నష్టాల వివరాలను సేకరిస్తున్నట్టు మండల వ్యవసాయ శాఖాధికారి బి.రాజారావు తెలిపారు.

కొవ్వూరు మండలంలో..

కొవ్వూరు: భారీ వర్షాలకు కొవ్వూరు, దొమ్మేరు, నందమూరు, పశివేదల గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. ముంపుతో కుమారదేవం, ఆరికిరేవుల, చిడిపి గ్రామాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని వరి పంటకు భారీ నష్టం వాటిల్లింది. రికార్డు స్థాయిలో వర్షం కురవడంతో నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ప్రధానంగా కొవ్వూరు-గుండుగొలను హైవేను ఆనుకున్న ఉన్న పంట పొలాలు పూర్తిగా ముంపు బారిన పడ్డాయి. భారీ వర్షాలకు కొవ్వూరు పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలోను, కోర్టు ప్రాంగణంలో భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. పోతురాజు దిబ్బ ప్రాంతంలో మునిసిపాలిటీ జనరేటర్ల సాయంతో నీటిని బయటికి తోడించింది. కొవ్వూరు శివారున ముంపు బారిన పడిన పొలాలను బీజేపీ నాయకులు బుధవారం పరిశీలించారు.ఆ పార్టీ నియోజకవర్గ కో-కన్వీనర్ బీవీ ముత్యాలరావు, జిల్లా కార్యదర్శి పిక్కి నాగేంద్ర పంటలను పరిశీలించారు.



దేవరపల్లి మండలం త్యాజంపూడిలో చెరువును తలపిస్తున్న వరి చేలు



కొవ్వూరు పట్టణ శివార్లలో నీట మునిగిన పంట

కుంభవృష్టి, సుడిగాలికి అతలాకుతలం

- వరికి 270 హెక్టార్లలోని పూర్తిగా, 1100 ఎకరాల్లో పాక్షికంగా నష్టం
- దెబ్బతిన్న 200 హెక్టార్లలోని ఉద్యాన పంటలు
- ఎగిరిపోయిన కూరగాయల పందిర్లు

పెరవలి: మంగళవారం రాత్రి కురిసిన కుంభవృష్టికి వరి, ఉద్యాన, కూరగాయల పంటలు భారీగా దెబ్బతిన్నాయి. మెరక, పల్లం అనే వ్యత్యాసం లేకుండా ఎక్కడా చూసినా మోకాలి లోతుకు పైగా ఎత్తున నీరు నిలిచిపోయింది. మండలంలో గత మూడు రోజుల్లో 282 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తడిసి ముద్దై, ఎందుకూ కొరగాకుండా పోయిన పంటలను చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. మరో వైపు సుడిగాలి ప్రభావంతో తోటలు, చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరగడంతో కరెంటు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 270 హెక్టార్లలోని వరి పంట దెబ్బతిందని, నేల నంటిన మరో 1,100 ఎకరాల్లోని వరి పంటకు పాక్షికంగా నష్టం వాటిల్లిందని, సుమారు 200 హెక్టార్ల వరకూ ఉద్యాన పంటలు పాడయ్యాయని డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ తెలిపారు. ఖండవల్లిలో ఐదు, ముక్కామలలో రెండు గృహాలు దెబ్బతిన్నాయని చెప్పారు. తుపాను నష్టం అంచనాలను ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని తెలిపారు. సుడిగాలికి వరిచేలు నేలనంటితే, అరటి తోటలు నిలువునా విరిగిపోయాయి. కూరగాయల పందిర్లు ఎగిరిపోయాయి. ఖండవల్లి వద్ద గోదావరి నుంచి వచ్చిన సుడిగాలి ప్రభావంతో 30 పశువుల పాకలు, 25 కూరగాయల పందిర్లు ఎగిరిపోయాయని లంకమాపల్లి గ్రామానికి చెందిన దిడ్ల సంపతరావు చెప్పాడు. కనీసం వెదురు గెడలు కూడ దొరకలేదని తెలిపారు. కానూరు, ఉసులుమర్రు, తీపర్రు, ముక్కామల, అన్నవరప్పాడు, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి గ్రామాల్లో 100కి పైగా విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయాని ఎలక్ట్రికల్ ఏఈ తెలిపారు. మంగళవారం రాత్రి కురిసిన కుంభ వృష్టికి అన్నవరప్పాడు, ఖండవల్లి, ముక్కామల, పిట్టల వేమవరం గ్రామాల్లో ధాన్యం రాశులు నీట మునిగాయి. అన్నవరప్పాడులోని నక్కల కాలువ నీరు ఎగతన్నడంతో పొలాల్లోని ధాన్యపు రాశులు మూడు అడుగుల మేర మునిగిపోయాయి.



లంకమాలపల్లిలో విరిగిపోయిన అరటి తోట

నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం

- జిల్లా వ్యాప్తంగా ముంపులో 1,457 హెక్టార్ల విస్తీర్ణంలోని వరి పంట
- 13 మండలాల్లోని 107 గ్రామాలపై తుపాను ప్రభావం
- తుపాను సహాయక జిల్లా ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్



దొమ్మేరు వద్ద ముంపులో ఉన్న పొలాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్

కొవ్వూరు: భారీ వర్షాలు, గాలులకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని తుపాను సహాయక జిల్లా ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్ అన్నారు. రైతులు అధైర్య పడాల్సిన పని లేదన్నారు. కొవ్వూరు మండలంలో పంటలు ముంపు బారిన పడిన ప్రాంతాలను బుధవారం సాయంత్రం ఆయన జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వివేక్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని 13 మండలాల పరిధిలోని 107 గ్రామాల్లో భారీ వర్షాల ప్రభావం ఉన్నట్టు గుర్తించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,457 హెక్టార్లలో వరి పంట ముంపు బారిన పడిందని, మరో 1,467 హెక్టార్లలోని వరి పంట నేల వాలినట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటికీ 24,411 హెక్టార్లలోని వరి పంట కోత దశలో ఉందన్నారు. పంట ముంపు బారిన ప్రాంతాల్లో నష్ట తీవ్రతను తగ్గించేందుకు జిల్లా యంత్రాంగం పని చేస్తోందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ నేల వాలిన వరి పంట మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని వరి పనలపై పిచికారీ చేయాలన్నారు. కొవ్వూరు ఆర్డీవో రామావత్ కృష్ణ నాయక్, జిల్లా ఉద్యాన శాఖాధికారి అరుణకుమారి, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఏడీఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సర్పంచుల చాంబర్ అధ్యక్షుడిగా లక్ష్మణరావు

కొవ్వూరు: జిల్లా సర్పంచుల చాంబర్ అధ్యక్షుడిగా చిడిపి పంచాయతీ సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు నియమితులయ్యారు. కొవ్వూరు నియోజకవర్గం చాంబర్ అధ్యక్షుడిగా మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి ముని రాజేంద్రప్రసాద్ (బాజ్జీ) ఎంపికయ్యారు. వారిద్దరినీ బుధవారం పట్టణంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గారపాటి శ్రీదేవి, యలమర్తి రాంబాబు, మరపట్ల కళాధర చక్రవర్తి, నాయుడు వీర్రాజు, వి.రామకృష్ణ, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఆ పార్టీ తాళ్లపూడి, చాగల్లు మండలాల అధ్యక్షులు ఘంటా కృష్ణ, ఉప్పులూరి చిరంజీవి, సీనియర్ నాయకుడు తొర్లపాటి షీతల్, కొప్పాక విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే పంట నష్టం అంచనాకు సర్వే

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడి హామీ
- పెరవలి, అజ్జరం గ్రామాల్లో నష్టపోయిన పంటల పరిశీలన

పెరవలి: పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకొంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. తుపాను ప్రభావంతో పెరవలి, అజ్జరం గ్రామాల్లో నష్టపోయిన పంటలను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ గురువారం నుంచే అధికారులు పంట నష్టం సర్వే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంట కోల్పోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి ఆంక్షలూ లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. అలాగే ఆఫ్‌లైన్‌లో కూడా ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వీలుగా ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేసినందున అధికారులకు రైతులు సహకరించాలని సూచించారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఏవో మేరీ కిరణ్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, సర్పంచులు గంగోలు సీతమ్మ, గార్లపాటి సుధా భూషణం తదితరులు ఉన్నారు.



పెరవలిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

పంట నష్టం ప్రాథమిక అంచనాలు సిద్ధం

గోపాలపురం నియోజకవర్గంలో 6,287 ఎకరాల్లో నష్టం

దేవరపల్లి: తుపాను వల్ల దెబ్బతిన్న వివిధ పంటల నష్టం ప్రాథమిక అంచనాలను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాల ప్రాథమిక అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి అందజేశారు. నియోజకవర్గంలో 6,287 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ఆ శాఖ అధికారులు తెలిపారరు. మండలాల వారీగా పంట నష్టం ప్రాథమిక అంచనాలు ఎకరాల్లో ఈ విధంగా ఉన్నాయి. దేవరపల్లి మండలంలో వరి 710, పొగాకు 400 , మొక్కజొన్న 10, వేరుశనగ 130, చెరకు 20 ఎకరాల్లో నష్టం జరిగినట్టు ఏవో కె. విజయ్ తెలిపారు. మొత్తం 1270 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. గోపాలపురం మండలంలో వరి 651, మినుము 14, వేరుశనగ 12, మొక్కజొన్న 13, పొగాకు 39 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు ఏవో బి.రాజారావు తెలిపారు. మొత్తం 729 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ఆయన తెలిపారు. నల్లజర్ల మండలంలో వరి 165, మినుము 47, వేరుశనగ 62, మొక్కజొన్న 488, పొగాకు 400, మొత్తం 1150 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ఏవో కె. కమల్ రాజ్ తెలిపారు. ద్వారకాతిరుమల మండలంలో వరి 1632, మొక్కజొన్న 1231, మినుము 82, వేరుశనగ 146, పొగాకు 45, మొత్తం 3138 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనాలు తయారు చేసినట్టు ఏవో దుర్గారమేష్ తెలిపారు.

పొగాకు తోటలపై ఇసుక మేటలు



దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో పొగాకు తోటపై ఇసుక మేటలు



గోపాలపురంలో వర్షానికి దెబ్బతిన్న పొగాకు తోట

- 30 శాతం విస్తీర్ణంలోని పంటకు నష్టం

దేవరపల్లి: భారీ వర్షాలకు మెట్ట ప్రాంతంలోని పొగాకు రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకూ కుండపోత వర్షం కురిసింది. దాంతో పొగాకు తోటలు నీటితో నిండిపోవడంతో రైతులు గట్లకు గండ్లు కొట్టి నీటిని బయటకు పంపుతున్నారు. బుధవారం రాత్రి వీచిన బలమైన ఈదురు గాలులకు పొగాకు తోటలకు నేల నంటగా, వరద నీరు తోటలను ముంచెత్తడంతో ఇసుక మేటలు వేశాయి. ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేయగా, వర్షాలకు మూడెకరాలు ఇసుక మేటలు వేసి పూర్తిగా దెబ్బతిన్నట్టు బందపురం రైతు సుంకర గంగరాజు తెలిపారు. సుమారు రూ.2 లక్షల నష్టం వస్తుందని వాపోయారు. ఈ ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలోని 19974 హెక్టార్లలో పొగాకు సాగులో ఉంది. వర్షాలకు సుమారు 30 శాతం తోటలు పూర్తిగా దెబ్బతిన్నట్టు రైతులు తెలిపారు.

గోపాలపురం: మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షపాతం 121.4 మిల్లీ మీటర్లుగా అధికారులు నమోదు చేశారు. మండలంలోని వేళ్లచింతలగూడెం, పెద్దాపురం, గోపాలపురం, రాజంపాలెం గ్రామాల్లో ముందుగా వేసిన పొగాకు నాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. సుమారు 30 నుండి 35 రోజుల వయసున్న పొగాకు మొక్కలు ఈదురు గాలులకు నేలకొరిగాయి. అధిక వర్షానికి పొగాకు తోటలు కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- రాజ్యాంగ నిర్మాత వర్ధంతి



దేవరపల్లి మండలం యర్నగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే తలారి నివాళులు

దేవరపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు యువతకు సూచించారు. అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిర్వహించారు. యర్నగూడెంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, రాష్ట్ర ఆయిల్‌పామ్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, సర్పంచ్ బొంతా భరత్ బాబు, ఎంపీటీసీ సభ్యుడు బొంతా చినబాబు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నిడదవోలులో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

అలాగే దేవరపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి. సువర్ణరాజు, టీడీపీ నాయకుడు గన్నమని హరికృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నిడదవోలు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్లన్నీ జలమయం .. గ్రామాల్లో అంధకారం

తాళ్లపూడి: మండలంలో తుపాను బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మంగళవారం రాత్రి 9 నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అన్ని గ్రామాల్లోనూ వర్షపు నీరు ఇళ్ల వద్ద నిలిచిపోయింది. వర్షపు నీటి తరలింపునకు బుధవారం ఉదయం నుంచీ అధికారులు, పంచాయతీ సిబ్బంది, సర్పంచులు విశేషయంగా కృషి చేశారు. ప్రక్కిలంక ఎస్సీ ఏరియా, వేగేశ్వరపురం, తాళ్లపూడి గ్రామాల్లోని యానాదుల కాలనీలు పూర్తిగా వర్షపు నీటిలో చిక్కుకున్నాయి. ప్రక్కిలంక వద్ద ఆర్ అండ్ బీ రోడ్డును తవ్వి వర్షపు నీరు దిగువకు వెళ్లే ఏర్పాటు చేశారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, నాయకులు యాళ్ల బాబురావు పనులను పర్యవేక్షించారు. గజ్జరంలోని కొత్త చెరువుకు గండి పడి పంట పొలాల్లోకి నీరు చేరింది. ధాన్యం రాశుల్లోకి నీరు చేరింది. మినుము, ఆకు కూరలు, కూరగాయల పంటలు ముంపు బారిన పడ్డాయి. తాడిపూడిలో పొగాపు తోటల్లోకి నీరు చేరడంతో దెబ్బతిన్నాయి. అన్నదేవరపేటలో తడిసిన ధాన్యపు రాశులను జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభొట్టి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణదేవరాయులు పరిశీలించారు.



తాళ్లపూడిలో ఇంట్లోకి చేరిన నీటిని తోడుతున్న మహిళ

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని బాలింతలు, గర్భిణులు, రోగులకు బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గుంటుపల్లి శివకుమార్, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, కాళ్ళ రాంబాబు, గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు, కొత్తపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.